

# పండగ కైఫీయత్

**మధురాంతకం రాజారాం**

ఏ భాషలోనైనా జంట పదాలని కొన్ని వుంటాయి. తెలుగులో మిన్ను మన్నూ, కొండ కోనా, మాట మన్ననా- అలాంటివి. ఈ కోవలో పండగ అనగానే దానికి జంటగా వచ్చి కుదురుకునే పదం దండగ? పండగ అన్నాక కొన్ని దండగ ఖర్చులు తప్పవని అంతరార్థం.

ఖర్చులలో ఏవి దండగ, ఏవి సార్థకం అన్న విషయాన్ని అటుంచి- పండగ అంటే ఏమిటి అని వివికిత్స.

కాలం అనంతం. 'కాలమనంతమైనను భూభ్రమణ, భూ పరిభ్రమణముల వలన ఏర్పడుచున్న రేయింబవళ్ళను బట్టి, ఋతు భేదములను బట్టి జనులు అనంతమైన కాలములో ఖండకల్ప ? గావించుకుని వ్యవహారములు జరిగింతురు' అంటాడు శాస్త్రకారుడు. మన్వంతరాలు, యుగాలు, శతాబ్దాలు ఒక వైపు, నెలలు, రోజులు, గంటలు వగైరా మరొక వైపు. వీటి నడుమ ముఖ్యమైన కాల ప్రమాణం సంవత్సరం. ఏడాదిలో మూడు వందల అరవై అయిదు రోజుల పొడుగునా వచ్చిన రాత్రులే తిరిగి వస్తాయి. అస్తమించిన సూర్యుడే తిరిగి ఉదయిస్తాడు. ప్రొద్దున్న లేస్తాం. కాల కృత్యాలు తీర్చుకుంటాం. వేళకింత భోం చేస్తాం. జీవనోపాధి కోసం ఎన్నుకున్న పనేదైతే వుందో అందులో నిమగ్నులమ వుతాం. చీకటి పడిన తర్వాత పడు కుంటాం, నిద్రపోతాం. ఇలా రోజులు ఒకదానికొకటి ప్రతిధ్వనిగా, యాంత్రి కంగా గడచిపోతే ఎలా? ఎడారిలో ఒయా సిస్సులా తరంగ సంక్షుభితమైన సాగ రంలో ప్రశాంతమైన దీవిలా, రణగుణ ధ్వనుల మధ్య పాట

కచ్చేరీలా మనిషి వొళ్ళంత ఆనందించే అవకాశం, పేద దీరే సదుపాయం, ఊపిరి త్రిప్పకునే వెసులుబాటు ఉండొద్దా? అందుకోసమే పండుగలు. మహాపురుషులు జన్మిస్తే కొన్ని, లోక కంటకులు చనిపోతే కొన్ని కాలంలో వచ్చే మార్పుల్ని బట్టి కొన్ని...

మన సమాజంలో దారిద్ర్య రేఖకు లోబడి, దాని దరిదాపుల్లో బ్రతికే వాళ్ళే ఎక్కువ. ఈ తరగతికి చెందిన కష్టజీవి, పాపం అల్పసంతోషి. పండగ పేరుతో ఆతడాశించే సుఖ సంతోషాలు అంతంత మాత్రమే. కంచానికి బదులుగా ఆతడా రోజు ఆకు కావాలని కోరుకుంటాడు. సంగటికి బదులుగా అన్నం మెతుకులు దొరికితే చాలనుకుంటాడు. ఆకులో ఒకటి రెండు పిండి వంటలు కనిపిస్తే పల్లకీ ఎక్కినట్టు పరవశిస్తాడు. రెండో మూడో కూరగాయలు గూడా తినగలిగితే మహీమండలంపైన ఆధిపత్యం దొరికినట్టు మురిసిపోతాడు. చిట్ట చివర చెక్కెరతోగాక పోయినా, బెల్లంతో చేసిన పరమాన్నం దొరికినా పరమానందంగా భజిస్తాడు. పండగనాడు ఆతడీపాటి భోజన సుఖాన్ని కోరుకోడం ఆడంబర మనిగానీ, అత్యాశ అనిగాని అనిపించుకో గూడదు. కలిగిన మా రాజుకు రోజూ పండగే! లేనివాడికి ఎండగ తప్పితే మరేముంది? ఆతడికేనాడు పుష్టిగా అన్నం దొరుకుతుందో ఆనాడే పండగ.


పోతే ఇక బట్టల విషయం చూద్దాం. బీదాబిక్కి జనానికి దుస్తులొక అవసరమే గానీ, హంగుకాదు. వాళ్ళల్లో తలకొక జత దుస్తులుంటే బ్రహ్మాండం. అందులో ఒక జత చిరిగిపోయిగానీ, లేక చిరిగి పోవడానికి సిద్ధంగాగానీ వుండడం సహజం. ఇంట్లో బూజు దులిపి, గోడలకు వెల్లవేసి, ద్వారాలకు పచ్చతోరణాలు గట్టిన తర్వాత ఇక వాళ్ళు కోరుకోవలసింది ఒక జత కొత్త బట్టలే. సవిలో సవిగా పండగ పూట వాళ్ళూ మాత్రం కొత్త దుస్తులు సమకూర్చుకోవాలను కోడంలో విడ్డూరం లేదు. అది ఆడంబరం క్రిందికి రాదు.

బాగా కలిగిన వాళ్ళు ఎంత దుబారా ఖర్చులకైనా తట్టుకోగలరు. లేనివాళ్ళు ఉన్నంతలో సరిపెట్టుకుంటారు. ఎటొచ్చీ ఆడంబరాల కోసం అర్రులు సాచేవి మధ్య తరగతి కుటుంబాలే. మధ్య తరగతి మానవుల విషయంలో వీళ్ళకున్న దానికీ, వీళ్ళు కోరుకునే దానికీ పొంతన వుండదు. ఇసుకలో పడుకుని, ఊహల్లో పసిడి మేడలు కట్టుకోడం వీళ్ళ స్వభావం. పండగ పేజల్లో బజార్లు క్రిక్కిరిసి వుండడానికీ, బట్టల షాపులు కిటకిటలాడిపోవడానికీ, టపాకాయల వ్యాపారం లక్షల రూపాయల్లో జరగడానికీ, బస్సుల్లో రద్దీ పెరగడానికి కారణం వీళ్ళే.

అక్కన్న మాదన్నలు అందలమెక్కితే, వాళ్ళతో సాటిగా వుండాలని మిసమిస నరసప్పమువగ చెట్టు ఎక్కాడని సామెత. మధ్య తరగతి కుటుంబాల దురభిమానముమ్మా ఇలాంటిదే. ఒకరి ఇంటికి ఒకరు వెళ్ళినప్పుడు వీళ్ళు బుద్ధిగా కూర్చోరు. మూలల్లో, మచ్చుల్లో, అలమరాల్లో లోపలి గదుల్లో ఏముందో, ఏమి లేదో పరిశీలిస్తారు. మామ్మా లోలోపల లెక్క గడుతూ వుంటారు. సోఫా వుంది. అయిదు మార్కులు ఉక్కు బీరువా వుంది. ఏడు మార్కులు పట్టె మంచముంది. పది మార్కులు. ఇలా గ్యాస్ పొయ్యికిన్ని, గ్రైండర్ కిన్ని, మిక్సీకిన్ని, ఫ్రిజ్ కిన్ని, టి.వి.కిన్ని అని ఎప్పటికప్పుడు మార్కుల జాబితా తయారు చేస్తారు. తమ ఇంట్లో లేనివి గూడా ఎదుటి వారి ఇంట్లో వున్నట్టయితే కుక్కిన పేనుల్లా కిముక్కు మనకుండా వుండి పోతారు. అలా కాకుండా తమకున్నవి కొన్ని వాళ్ళకు లేకపోతే 'ఏమండీ! గ్రైండర్ లేదా మీ ఇంట్లో? అయ్యో, అవసరంగదండీ! పిండి రుబ్బుకోవాలంటే ఏం చేస్తారు? అయినా ఈ రోజుల్లో టి.వి. లేకపోతే టైము గడిచేదెట్లాగండీ! కలర్ టి.వి. గాకపోతే మానె బ్లాక్ అండ్ వైట్ అయినా కొనుక్కోగూడదా?' అంటూ ఎద్దేవా



చేస్తారు. అందువల్ల తలతాకట్టు పెట్టి అయినాసరే, ఈ స్టేటస్ సింబల్స్ని సంపాదించి పెట్టుకోవాలన్నది ఈనాటి సగటు మానవుడి ధ్యేయమై పోయింది. కానీ అందుకు దారి? జీతం రాళ్ళలో మిగిలించి కొనుక్కోవాలంటే అదొక పంచవర్ష ప్రణాళికగావచ్చు. అంత వరకు ఓపిక పట్టడం సాధ్యమా? ఉపాయాంతరాన్ని అన్వేషించక తప్పదు. ఉపాయం నెంబర్ వన్. తన దగ్గరతానే అప్పు చెయ్యడం. ఎలాగంటారా? ఎల్.ఐ.సి. డిపాజిట్లలో నుంచీ, ప్రావిడెంటు ఫండునుంచీ, ఫెస్టివల్ అడ్వాన్సు ఖాతాలో నుంచీ అప్పులు తీసుకోడం. ఇందువల్ల చిరిగి చిరిగి చదరంతైనట్టుగా జీతం కోతల పాలవుతుందనుకోండి! సంసారరథం సాఫీగా సాగిపోయే ప్రాప్తం లేక పోవచ్చుననుకోండి! పరవాలేదు.




మనం తినేది ఎవరు మాస్తారు? వాళ్ళు చూచేదల్లా మన గ్రైండర్, మిక్సీ, బాయిలర్, హీటర్ వగైరాలనే కదా!


ఇక్కడొక చిన్న కథ. చిత్తగించండి.

ద్వారకానగర్ కాలనీలో గోవిందరావు అని ఒక గృహస్తుడు. మునీంద్రమూర్తి అని అతనికొక స్నేహితుడు. ఒకానొక ప్రసిద్ధ దినపత్రికకు సంచార విలేకరిగా పనిచేసే మునీంద్రమూర్తి విశాఖ పట్నం నుంచి అపురూపమైన రేడియో కమ్ టేప్ రికార్డర్ ఒకటి తీసుకొచ్చి మిత్రుడు గోవిందరావుకు బహూకరించారు. భర్త చేతికి వచ్చిన వస్తువు భార్యకే దక్కాలన్న న్యాయాన్ని బట్టి, అది గోవిందరావు సతీమణి రుక్మిణమ్మ ప్రాపకంలోకి వచ్చింది. భర్త యింటి దగ్గర లేనప్పుడల్లా రుక్మిణమ్మ పదురు శబ్ద ప్రసార యంత్రంతోనే కాలం గడప సాగింది. కథ అంతటితో ఆఖరై పోలేదు. అక్కడ నుంచే ఆరంభమైంది. గోవిందరావింటి పని పిల్ల వీథిలో కనిపించిన వాళ్ళవందరినీ నిలబెట్టి 'అబ్బబ్బ, ఎంత బాగుందెంత బాగుందో! అలాంటిది ఈ వీథిలో యింకొకరింట్లో ఎక్కడైనా వుందా? మా రుక్మిణమ్మగారి అదురుష్టమే అదురుష్టం. పరిలేరు వేరెవ్వరూ, మా అమ్మగారికి పరిలేరు వేరెవ్వరూ' అంటూ ఢంకా భజాయించి చెప్ప సాగింది. ఆ మాట పొరుగింటి సత్యవతమ్మ చెవిలో పడిందో లేదో, ఆమె అవమానభారంతో మండిపడి పోయింది. పోదా మరి!

దేశ సంచారి మునీంద్రమూర్తి ఒక

దీపావళి శుభాకాంక్షలతో

ఈసీ కలర్ టి.వి.
డబ్బుకు పూర్తి విలువ
చాలాకాలం మన్నుతుంది
కనుక!




ఆథరైజ్డ్ మెయిన్ డీలర్:
ఫోన్: 6273

గాయత్రి ఎలక్ట్రానిక్స్ సేల్స్ - సర్వీస్ - స్పేర్స్
H.O. 17/129, ట్రంకు రోడ్డు,
Show Room: Opp. INDIAN BANK, ట్రంకు రోడ్డు, నెల్లూరు — 524 001

దొక్కు రేడియో పెట్టెను తెచ్చి గోవిందరావుకివ్వనేల? ఇచ్చినాడుపో, ఈ డబ్బు కక్కుర్తి గోవిందరావు దాన్ని ఏ మారు బేరానికో తెగనమ్ముకోక, తగుదునమ్మా అంటూ తెచ్చి తన భార్యకే ఇవ్వనేల? ఇచ్చెనుబో, ఆ మాత్రం భాగ్యానికి ఈ అబ్బ్వాకారపు రుక్మిణమ్మ అంతగా పొంగిపోనేల? పొంగిపోయిందిబో, పొంగిందంతా పొయ్యిపాలేనముకోక ఈ ముప్పనాతి పనిపిల్ల వీథిపైకెక్కి అందును గురించి దండోరా వేయనేల? 'హా, హత విధీ! సహింతునా, ఈ దురాగతమును భరింతునా' అనుకుంటూ ఆమె నిప్పుల్లో పడిన ఉప్పులా పేల్లిపోసాగింది. ఆ రోజు సాయంకాలం అనాబ్‌షాహి ద్రాక్షపళ్ళు బుట్టలో పెట్టించుకుని, మల్లెపూలను పొట్లం కట్టించుకుని, స్వీటు కిళ్లీలు పార్శిలు చేయించుకుని సత్యవతమ్మ ప్రాణపతి మదనమోహన గోపాల కృష్ణమూర్తి ఇంటి చేరువకు వచ్చేసరికి- ఆ ఇల్లెలా వుంది? చీకట్లో వెలవెలపోతూ వుంది. గోపాల కృష్ణమూర్తి తలుపులు తోసుకుంటూ లోపలికి వెళ్లాడు. లైటు వేశాడు. ఏదీ సత్యవతి? హాల్లో లేదు, వంట గదిలో లేదు, డ్రాయింగు రూంలో లేదు. మరెక్కడుంది? శయనాగారంలో వుంది. ఎలా వుంది? రేగిపోయిన కేశ పాశాలతో, మాసిన వలువలతో, పౌడైనా వేసుకోకుండా వుడికిపోతూ అరాళకుంతల 'సత్యవతి, కుందరదన సత్యవతి, రాజనిభాస్య సత్యవతి అలకపాన్పు మీద వేడి నిట్టూర్పులు విగిసిస్తూ వుంది. గోపాల కృష్ణమూర్తి తెల్లబోయాడు. క్రుంగిపోయాడు. 'ఏమిటి సత్యా! ఏం జరిగిందో చెప్పవూ? ఉదయం నేను ఆఫీసుకు వెళ్ళినప్పుడు బాగానే వున్నావే! ఈ లోగా ఏమైంది? ఒంట్లో బాగుండడంలేదా? డాక్టరుగారిని రప్పిద్దామా? వద్దా! మరేమిటి? కారణం చెప్పకుండా ఇలా హఠం సాగిస్తే తట్టుకోగలనా? నను, భవదీయ దాసుణ్ణే ఇలా శిక్షించడం తగునా?' అంటూ కాళ్లా వేళ్లాబడి బ్రతిమాలుకున్నాడు. అప్పటికి శాంతించినదై సత్యవతమ్మ లేచికూర్చుని తనకు జరిగిన అవమానాన్ని పూసగుచ్చినట్టుగా భర్తకు నివేదించింది. 'ఓస్, ఇంతేనా?' అన్నట్టు గోపాల కృష్ణమూర్తి తేలిగ్గా నవ్వేశాడు. 'విశాఖ నుంచి తెచ్చిన బోడి రేడియో కమ్ టేప్ రికార్డరుకేనా ఇంత గొడవ! నీకెందుకు? నువ్వూరుకో. నేను పక్కా బొంబే నుంచి లేటెస్ట్ మోడల్ టి.వి. కమ్ వీడియో సెట్టును తెచ్చి నీకు ప్రజెంట్ చేస్తాను' అంటూ బాస చేశాడు. బాస చేయడమే గాదు, దాన్ని నిలబెట్టుకున్నాడు గూడా! అంతటితో ఆనందభరితురాలైపోయిన సత్యవతి భర్త తెప్పించి ఇచ్చిన దృశ్య ప్రసార యంత్రాన్ని వీథిలో వెళ్లేవారికంతా కనిపించేటట్టు హాల్లోనే ప్రతిష్టించి, తలుపులు మూయడం గూడా మరచిపోయి, 'మీరజాలగలడా నా ఆనతి, సత్యాపతి, మీరజాలగలడా?' అని పాడుతూ, ఆ పాటకు అభినయం గూడా పట్ట సాగిందట!- సరే, బాగుంది. 'కానీ ఇది కొత్త కథలా లేదే! ఒక ప్రసిద్ధ పురాణ కథకు అనుకరణలా వుందే!' అని ఎవరైనా సందేహం వెలిబుచ్చవచ్చు. అనుమానం అనవసరం. ఇది పాత కథే. అయితే ఇది ఇలాతలంపైన కుటుంబాలనేవి వున్నంత వరకూ, ఆ కుటుంబాలలో భార్యామణులనేవాళ్లు వున్నంతవరకూ, ఆ భార్యామణుల మనసులో కోరికలు చెలరేగే వరకు మళ్ళీ మళ్ళీ జరిగే సరికొత్త పాత కథ.

అయితే ఒకటి. సత్యవతమ్మ భర్త అయిన మదనమోహన గోపాల కృష్ణమూర్తి ఎవరోగానీ అతడు బాగా జరుగుబాటున్నవాడై వుండాలి. బహుశా సాలీనా లక్షో, రెండు లక్షలో ఆర్జించే వ్యాపార, వ్యవహార దక్షుడై వుండొచ్చు. కాని నెల నెలా ఒక నికరమైన మొత్తాన్ని మాత్రమే కళ్ల చూసే గవర్నమెంటు ఉద్యోగై వుండి వుంటే అప్పుడతని గతి ఏమిటి? ఇది తరచి తరచి ఆలోచించవలసిన దయనీయమైన విషయం.

మళ్లీ అసలు విషయంలోకి వద్దాం. వస్తు సముపార్జనకు దారి జూపే రెండో ఉపాయం వాయిదాల పద్ధతిపైన వస్తువులను స్వంతం చేసుకోడం. ఇది అమోఘమైన ఉపాయం గూడా! ఎందుకంటే బట్టల దగ్గరి నుంచి బంగారు నగల వరకు, టేబిల్ ఫాను దగ్గరి నుంచీ టెలివిజన్ సెట్టు వరకు వాయిదాల పద్ధతిపైన దొరకని వస్తువంటూ లేదు. మొదటి వాయిదా డబ్బులు చెల్లించి వస్తువును ఇంటికి తెచ్చుకున్నప్పుడు అవలీలగా పెన్నిధిని చేజిక్కించుకున్నంత ఆనందంగా వుంటుంది. మిగిలిన వాయిదాలు చెల్లించవలసి వచ్చినప్పుడే ఇబ్బంది. పేరుకపోయిన పాపంలా ఆ అప్పు ఒక పట్టాన తీరదు.




శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు. ఎడతెగని లోటు బడ్జెట్టును పూడ్చడానికి అదనంగా కొత్త అప్పులు చేయాల్సి వస్తుంది. ఈ దశలో వడ్డీ వ్యాపారస్తులు రంగ ప్రవేశం చేస్తారు. వీళ్ల నిస్సందేహంగా షైలాక్‌ను చంపి పుట్టిన వాళ్ళై వుంటారు. అప్పటికేదో ఉపకారం చేసినట్టు నూటికి నెల ఒకటికి అయిదు రూపాయిల దగ్గరి నుంచి పది పదిహేను దాకా వడ్డీ గుంజుకుంటారు. వీరి కబంధ హస్తాల్లో తగులుకోడమంటే వైకుంఠపాళీలో పాము నోట పడినట్టే!

ఉన్నవి చాలక ఇటీవలి కాలంలో పుట్టిన రోజులు, పెళ్ళిరోజులు మన పండుగల జాబితాలో చోటు చేసుకున్నాయి. కానీ పెక్కు సందర్భాల్లో కుటుంబ వ్యవస్థను మళ్లీ కోలుకోనీకుండా దెబ్బతీస్తున్నవి వివాహాలే. భూదేవంత అరుగువేసి, ఆకాశమంత పందిరి వేసి జాంజాంమ్మంటూ పెండ్లి చేసే రోజులు కావు. ఒక భోజనం, ఒక టిఫినుతో చేసే వివాహాలే అయినా వీటి కవుతున్న వ్యయమేమీ తక్కువగాదు. ఇన్విటేషన్ల దగ్గర నుంచీ హంగామా ప్రారంభం! ఇన్విటేషన్ ఒకటింటికి ఒకటింపావలా, విందు విస్తరి ఒకటింటికి పదిహేను రూపాయిలు అని చెప్పుకోడం దర్జాకు గుర్తైపోయింది. ఇన్విటేషన్లలో ఎక్కువ భాగం వేస్ట్ పేపర్ బాస్కెట్లలోకి, విందు విస్తరిలో ఎక్కువ భాగం చెత్త డబ్బాలలోకి వెళ్తున్నాయని ఎవరికి తెలియదు? పోతే, ఇక ముహూర్తానికి వధువు కోసం పట్టు చీర తేవలసిందే. అదైనా ఒకటి రెండు వేలైతే నాలీసు. నాలుగైదు వేలదాకా సాగదీస్తేనే సంతృప్తి. మా అమ్మాయికి రెండు వందల గ్రాముల బంగారం పెట్టామని గొప్పలు చెప్పుకోడం సులభమే. కానీ అందుకవసరమైన భారీ మొత్తం ఎక్కడి నుంచి వచ్చిందన్నదే ప్రశ్న! ఆధునిక సమాజంలో 'పెళ్ళి' అనేది పెద్ద మాయాబజారైపోయింది. పెళ్లిళ్ల మార్కెట్లో గుణం, రూపం, చదువు అనే వాటికి కితాబు లభించడంలేదు. వేలం పాటలో హెచ్చు మొత్తం పలికిన సంబంధానికే గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. సూత్ర ధారణ తర్వాత పురోహితుడు వధూవరులను ఆరుబయటకు తీసుకెళ్ళి 'అరుంధతి'ని చూపించడం సాంప్రదాయం. వరుడికి అరుంధతీ నక్షత్రం కనిపిస్తే కనిపించవచ్చు. కాని కన్యాదాతకు కనిపించేవి మాత్రం అప్పులే!

ఎంత చెట్టుకు అంత గాలి అయితేనే శ్రేయస్కరం. ఇందుకు వ్యతిరేకంగా జరిగితే కాయలు రాలిపోవచ్చు. కొమ్మలు విరిగి పోవచ్చు. చెట్టు సమూలంగా పైకి లేచిపోవచ్చు. తలకు మించిన ఆడంబరాల వల్ల కుటుంబాలకు అలాంటివేవి వాటిల్లగూడదని బుద్ధిమంతులు కోరుకుంటారు. ఏడాదికొకనాడు దీపావళిలా గడిస్తే చాలదు. ప్రతిరోజు ఆనంద దీపావళిగా గడిచే మంచి కాలం కోసమే మన నిరీక్షణ.